పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 725 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ బుధవారం 23.09.2026 పేజీలు : 8 వెల : 4/-



## తిరువూరు రోడ్ల అభివృద్ధికి

# సీఎం చంద్రబాబు శంకుస్థాపన



**మధిర ప్రధాన రహదారి ఆధునికీకరణ పనులకు శ్రీకారం**

- రూ. 14 కోట్ల పనులకు వర్చువల్ గా శంకుస్థాపన చేసిన చంద్రబాబు
- ప్రత్యక్షంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కొలికపూడి

## స్థానిక ఎన్నికల్లో

# 94% గెలవాల్సిందే: లోకేశ్

- ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని సూచన
- టీడీపీకి కోటి ఆరు లక్షల మంది సభ్యులున్నారని వెల్లడి
- జనసేన, బీజేపీతో కలిసి ముందుకు సాగాలని సూచన
- కూటమిలో సమస్యలను చర్చలతో పరిష్కరించుకోవాలని పిలుపు
- కష్టపడే కార్యకర్తలను గుర్తించి గౌరవిస్తామన్న లోకేశ్

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతానికి పైగా స్థానాలను కైవసం చేసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటినుంచే కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం జరిగిన తరువాయి 2లో




## దేశంలోనే భారీ రియల్ ఎస్టేట్ డీల్

# రూ. 711 కోట్లతో భవనం కొనుగోలు

- దేశంలోనే అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ డీల్ నమోదు
- రూ. 711 కోట్లకు ముంబైలో 8 అంతస్తుల టవర్ కొనుగోలు
- భవనం కొనుగోలు చేసిన ఏంజెల్ వన్ వ్యవస్థాపకుడు దినేష్ ఠక్కర్
- ఈ డీల్‌తో భారీగా లాభపడిన డెవలపర్ కంపెనీ షేర్లు



దేశ ఆర్థిక రాజధాని ముంబైలో దేశంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ ప్రాపర్టీ డీల్ నమోదైంది. ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'ఏంజెల్ వన్' వ్యవస్థాపకుడు దినేష్ ఠక్కర్, సముద్ర తరువాయి 2లో



## ట్రంప్ పక్షాన నిలిచినా..

# తప్పని అవమానాలు!

- ట్రంప్‌కు మద్దతిస్తున్న భారత సంతతికి జాత్యహంకార వ్యాఖ్యలు
- భావజాలం కన్నా జాతే ముఖ్యమంటున్న కొందరు ట్రంప్ మద్దతుదారులు
- భారత సంతతి నేత హర్మీత్ ధిల్లాన్‌పై సొంత వర్గం నుంచే దాడి
- గతంలో ప్రోగ్రెసివ్‌లకే పరిమితమైన దాడులు.. ఇప్పుడు కన్జర్వేటివ్‌లపైనా
- "అసలైన అమెరికన్" అని నిరూపించుకోవాల్సిన దుస్థితి

2లో

## అమెరికాకు ఇరాన్ ఆఫర్

# తగ్గిన క్రూడాయిల్ ధరలు

- హర్మూజ్ జలసంధి తెరవడానికి సిద్ధమన్న ఇరాన్
- అమెరికా సైనిక ఒత్తిడి తగ్గించాలని షరతు
- పోర్టుల దిగ్బంధనం ఎత్తివేయాలని డిమాండ్
- మధ్యవర్తుల ద్వారా అమెరికాకు ప్రతిపాదన
- చమురు ధరలు 99 డాలర్ల దిగువకు పతనం

2లో





## అమెరికాలో 90 అడుగుల

# హనుమాన్ విగ్రహ వివాదం

- కూల్చేస్తామంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలతో రాజుకున్న దుమారం
- ఇది హిందూ మతంపై దాడి అంటూ అమెరికాలోని హిందూ సంఘాల ఆగ్రహం
- అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ మతపరమైన చర్చకు దారితీసిన ఘటన
- విగ్రహం ప్రైవేట్ ఆస్తిలో ఉందని, ఐక్యతకు చిహ్నమని ఆలయ వర్గాల వెల్లడి

అమెరికాలోని టెక్సాస్‌లో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఇప్పుడు రాజకీయ,

తరువాయి 2లో

# జైలుకైనా సిద్ధం

## డిసెంబర్‌లో స్వదేశానికి షేక్ హసీనా

- ఉరిశిక్ష రాజకీయ ప్రేరేపితమని, జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని స్పష్టం
- అవామీ లీగ్ పార్టీని పునర్నిర్మించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే లక్ష్యం
- బంగ్లాలో ఉగ్రవాదం ముప్పు తీవ్రంగా ఉందన్న మాజీ ప్రధాని
- తిరిగి వచ్చే విషయంపై ప్రభుత్వాలతో చర్చలు జరపలేదని వెల్లడి

2లో



## కామరాజర్ టిఫిన్ స్కీమ్

# విద్యార్థులతో కలిసి తిన్న విజయ్

- తమిళనాడులో 8వ తరగతి వరకు విస్తరించిన ఉచిత అల్పాహార పథకం
- 'పెరుంతలైవర్ కామరాజర్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్'గా పేరు మార్పు
- అదనంగా 15.3 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం
- పథకం మొత్తం బడ్జెట్‌ను సుమారు రూ. 724 కోట్లకు పెంచిన ప్రభుత్వం
- చెన్నైలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన



**సీఎం విజయ్**

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత అల్పాహార పథకాన్ని మరింత విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 1 నుంచి 5వ తరగతి వరకు అమలవుతున్న ఈ పథకాన్ని మంగళవారం నుంచి తరువాయి 2లో

పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..



# తిరువూరు రోడ్ల అభివృద్ధికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. తిరువూరు పట్టణంలోని మధిర ప్రధాన రహదారి ఆధునీకరణ, విస్తరణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' విధానంలో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. సచివాలయం నుంచి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయగా, స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు మధిర రోడ్డు వద్ద ప్రత్యక్షంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని ప్రపంచ స్థాయి ఐఎస్‌బీ రోడ్లు, రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సిస్ రోడ్ల నమూనాలో తిరువూరు మధిర రహదారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ





రూ.14 కోట్ల ప్రాజెక్టు పూర్తయితే తిరువూరు పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని... ప్రయాణికులు, స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి స్వయంగా డప్పు కొట్టి, నృత్యం చేస్తూ కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఏ. కుమార్, మున్సిపల్ కమిషనర్ కె. మనోజ్, టీడీపీజనసేనబీజేపీ కూటమి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో 94% గెలవాల్సిందే: లోకేశ్

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతానికి పైగా స్థానాలను కైవసం చేసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటినుంచే కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో లోకేశ్ మాట్లాడారు. టీడీపీకి కోటి ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారని లోకేశ్ తెలిపారు. ఇప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా తమ కుటుంబంలో భాగమయ్యారని, బీజేపీ కూడా కూటమిలో కలిసి పనిచేస్తోందని చెప్పారు. మూడు పార్టీలు కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్తున్నాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ సూచించారు. "ఎన్నికలు.. తగ్గేదేలే" అంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించి గౌరవిస్తామని చెప్పారు. ప్రజల్లో ఉంటూ వారికి సేవ చేయాలని సూచించారు. కూటమిలో ఏవైనా సమస్యలు ఉంటే నాలుగు గోడల మధ్య కూర్చొని చర్చించుకుని పరిష్కరించుకోవాలని లోకేశ్ అన్నారు. ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ దానికి కట్టుబడి ఉండాలని సూచించారు. మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగితే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని చెప్పారు. గతంలో పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్న లోకేశ్.. వారి కష్టాన్ని ప్రజా సేవ ద్వారా గౌరవించాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతానికి మించి స్థానాలు సాధించేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు.

## దేశంలోనే భారీ రియల్ ఎస్టేట్ డీల్.. రూ. 711 కోట్లతో భవనం కొనుగోలు

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో దేశంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ ప్రాపర్టీ డీల్ నమోదైంది. ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'ఏంజెల్ వన్' వ్యవస్థాపకుడు దినేష్ ఠక్కర్, సముద్ర తీరానికి అభిముఖంగా ఉన్న ఒక విలాసవంతమైన భవనాన్ని రూ. 711 కోట్లకు కొనుగోలు చేశారు. భారతదేశ చరిత్రలో ఒకే నివాస ఆస్తికి సంబంధించి జరిగిన అత్యంత ఖరీదైన లావాదేవీ ఇదే కావడం విశేషం. ముంబైలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఉన్న ఈ ఎనిమిది అంతస్తుల భవనం సుమారు 63,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీనిని ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఎంబసీ డెవలప్‌మెంట్స్ లిమిటెడ్' నిర్మించింది. ఈ భారీ డీల్ వార్త వెలువడిన వెంటనే, స్టాక్ మార్కెట్‌లో ఎంబసీ డెవలప్‌మెంట్స్ షేర్లు 8.3 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. ఈ లావాదేవీ ముంబైతో పాటు దేశవ్యాప్తంగా అల్ట్రాలగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఉన్న బలమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది. ఇటీవల కాలంలో ఇటువంటి భారీ కొనుగోళ్లు పలుమార్లు చోటుచేసుకున్నాయి. గతంలో యూఎస్‌వీ ఛైర్‌పర్సన్ లీనా గాంధీ తివారీ రూ.639 కోట్లతో ఒక అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేయగా, ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్, ఆయన కుటుంబ సభ్యులు రూ.400 కోట్లకు పైగా విలువైన సీఫేసింగ్ టవర్‌ను సొంతం చేసుకున్నారు. ప్రాపర్టీ డేటా విశ్లేషణ సంస్థ జాప్‌కీ ప్రకారం, జనవరి 2025 నుంచి ఇప్పటివరకు దేశంలో రూ.100 కోట్లకు పైగా విలువైన 37 రెసిడెన్షియల్ డీల్స్ జరిగాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ.5,600 కోట్లుగా నమోదైంది.

## ట్రంప్ పక్షాన నిలిచినా.. తప్పని అవమానాలు!

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్, ఆయన 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ఉద్యమానికి గట్టి మద్దతుదారులుగా ఉన్న భారత సంతతి కన్జర్వేటివ్‌లకు ప్రస్తుతం అనూహ్య అనుభవాలు ఎదురవుతున్నాయి. తమ భావజాలం తమను అమెరికన్‌లుగా పూర్తిస్థాయిలో గుర్తిస్తుందని వారు భావిస్తున్నప్పటికీ, వారిలో కొందరు సొంత పార్టీ నుంచే జాత్యహంకార వ్యాఖ్యలను, వివక్షను ఎదుర్కోవడం చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ రాజకీయాల్లో భావజాలానికే ప్రాధాన్యత ఉంటుందని, జాతి, మూలాలకు తావుండదని చాలా మంది భారతీయఅమెరికన్లు విశ్వసించారు. అయితే, ఇటీవలి పరిణామాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. వారు భావజాల పరంగా తమ నిబద్ధతను చాటుకున్నప్పటికీ, "మీరు ఎంతవరకు అమెరికన్లు?" అనే ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రముఖ కాలమిస్ట్ చిదానంద్ రాజఘట్ట తన కథనంలో విశ్లేషించారు. ట్రంప్ ప్రభుత్వంలో పనిచేస్తున్న చండీగఢ్ మూలాలున్న హర్మీత్ ధిల్లాన్, తనను తాను అమెరికన్‌గా చాటుకునేందుకు బీఫ్ డిన్నర్ ఫొటో పోస్ట్ చేశారు. దీనిపై 'మాగా' మద్దతుదారులే ఆమెను ఎగతాళి చేశారు. తనను 'పేపర్‌వర్క్ అమెరికన్' అంటూ రోజూ జాత్యహంకార వ్యాఖ్యలు ఎదుర్కొంటున్నానని ఆమె స్వయంగా తెలిపారు. అలాగే, దినేశ్ డిసౌజా తన కుమార్తెపై వచ్చిన జాతి వివక్ష దాడిని తిప్పికొట్టేందుకు, ఆమె తల్లి శ్వేతజాతీయురాలని చెప్పాల్సి రావడం విమర్శలకు దారితీసింది. గతంలో వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ వంటి వారు కూడా తమ అమెరికన్ గుర్తింపును నిరూపించుకోవడానికి ప్రయత్నించాల్సి వచ్చింది. సాధారణంగా ప్రగతిశీల భావాజాలం కలిగిన ప్రమీలా జయపాల్ వంటి నేతలు 'మీ దేశానికి తిరిగి వెళ్లండి' వంటి విమర్శలను మొదటి నుంచీ ఎదుర్కొంటున్నారు. అయితే, ఇప్పుడు ట్రంప్ వాదాన్ని అత్యంత బలంగా వినిపిస్తున్న కన్జర్వేటివ్‌లు సైతం అదే వర్గం నుంచి ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం గమనార్హం.

### అమెరికాకు ఇరాన్ ఆఫర్
## తగ్గిన క్రూడాయిల్ ధరలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం. అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు. హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది. హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకునే అవకాశం ఉందన్న వార్తలతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. బ్యారెల్ చమురు ధర 99 డాలర్ల దిగువకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర సెషన్ గరిష్ఠ స్థాయి నుంచి 3.5 శాతానికి పైగా తగ్గగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2.25 శాతం పడిపోయింది. హర్మూజ్ ద్వారా ముడిచమురు సరఫరాలో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి.

## జైలుకైనా సిద్ధం.. డిసెంబర్‌లో స్వదేశానికి షేక్ హసీనా

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. 2026 డిసెంబర్ నాటికి తాను తప్పకుండా స్వదేశానికి తిరిగి వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. తాను ఎప్పుడు వెళతాననే దానికంటే, ఏ విధంగా వెళతాననేదే అత్యంత ప్రధానమని ఆమె వ్యాఖ్యానించారు. ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా ఈ విషయాలను వెల్లడించారు. తన పునరాగమనం శాంతియుత మార్గంలో, చట్టబద్ధంగానే ఉండాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. 2025 నవంబర్‌లో బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ తనకు మరణశిక్ష విధించడాన్ని హసీనా తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, అన్యాయమైన తీర్పు అని ఆమె ఆరోపించారు. తన నిష్క్రమణ అనంతరం కొలువుదీరిన ప్రస్తుత ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా, తనపై జరుగుతున్న విచారణను ఒక ప్రహసనంగా ఆమె అభివర్ణించారు. తన రాజకీయ పోరాటంలో భాగంగా జైలుకు వెళ్లేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆమె తేల్చిచెప్పారు. ప్రస్తుతం రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఎదుర్కొంటున్న తన 'అవామీ లీగ్' పార్టీని పునర్నిర్మించడం, పార్టీ శ్రేణులతో సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తానని హసీనా వివరించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద, తీవ్రవాద శక్తుల నుంచి ముప్పు పొంచి ఉందని, ఇది కేవలం ఆ దేశ అంతర్గత సమస్య మాత్రమే కాదని, ఒక తీవ్రమైన ప్రాంతీయ ముప్పు అని ఆమె హెచ్చరించారు. అయితే, తన పునరాగమన ప్రణాళికలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ఖరారు కాలేదని ఆమె వెల్లడించారు. ఈ విషయంపై బంగ్లాదేశ్ లేదా భారత ప్రభుత్వాలతో తాను ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక లేదా అనధికారిక చర్చలు జరపలేదని హసీనా స్పష్టం చేశారు.

### అమెరికాలో 90 అడుగుల
## హనుమాన్ విగ్రహ వివాదం

అమెరికాలోని టెక్సాస్‌లో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఇప్పుడు రాజకీయ, మతపరమైన వివాదానికి కేంద్రంగా మారింది. ఈ విగ్రహాన్ని కూల్చేస్తామంటూ ఓ కన్జర్వేటివ్ యూట్యూబర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఇది హిందూ మతంపై జరిగిన దాడిగా అక్కడి హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. టెక్సాస్‌లోని షుగర్ ల్యాండ్‌లో ఉన్న శ్రీ అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై కన్జర్వేటివ్ యూట్యూబర్ జెస్సీ హ్యూస్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "మేము గెలిచినప్పుడు ఈ విగ్రహాన్ని కూల్చేస్తాం" అని పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్య తీవ్ర దుమారం రేపడంతో పాటు అమెరికాలోని హిందూ సమాజం నుంచి బలమైన ప్రతిస్పందన వచ్చింది. జెస్సీ వ్యాఖ్యలపై అమెరికా సైన్యంలో పనిచేసిన రుచిర్ బక్షీ తీవ్రంగా స్పందించారు. ఇది హిందూ మతంపై జరిగిన దాడి అని, దేశభక్తి లేని చర్య అని ఆయన మండిపడ్డారు. కోయలిషన్ ఆఫ్ హిందూస్ ఆఫ్ నార్త్ అమెరికా (CoHNA) వంటి సంస్థలతో పాటు ఇతర సైనికోద్యోగులు కూడా హిందూ సమాజానికి మద్దతుగా నిలిచారు. తమ ప్రార్థనా స్థలాలను కాపాడుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని స్పష్టం చేశారు. ఈ ఏడాది 2024 ఆగస్టులో 'స్టాట్యూ ఆఫ్ యూనియన్' పేరుతో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇది అమెరికాలోనే అత్యంత ఎత్తైన హనుమాన్ విగ్రహాల్లో ఒకటి. అయితే, విగ్రహ ఏర్పాటు నుంచే కొందరు క్రిస్టియన్ కన్జర్వేటివ్‌లు దీనిని 'క్రైస్తవ వ్యతిరేకం' అని, 'దొంగ దేవుడు' అని విమర్శిస్తున్నారు. టెక్సాస్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఈ వివాదం ప్రాధాన్యం సంతరించుకుంది. వలసలు, సాంస్కృతిక గుర్తింపు వంటి అంశాలపై జరుగుతున్న విస్తృత చర్చకు ఇది అద్దం పడుతోంది. టెక్సాస్‌లో భారతీయ అమెరికన్ల జనాభా గణనీయంగా ఉండటం కూడా ఈ వివాదానికి రాజకీయ రంగు పులుముతోంది. ఈ వివాదంపై ఆలయ అధికారులు స్పందిస్తూ, ఈ విగ్రహం తమ ప్రైవేట్ ఆస్తిలో ఉందని, ఇది స్థానిక హిందూ సమాజం భక్తికి, ఐక్యతకు చిహ్నమని వారు వివరించారు.

## కామరాజర్ టిఫిన్ స్కీమ్.. విద్యార్థులతో కలిసి తిన్న విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత అల్పాహార పథకాన్ని మరింత విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 1 నుంచి 5వ తరగతి వరకు అమలవుతున్న ఈ పథకాన్ని మంగళవారం నుంచి 6, 7, 8 తరగతుల విద్యార్థులకు కూడా వర్తింపజేశారు. ఈ సందర్భంగా పథకం పేరును 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' నుంచి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, విద్యా సంస్కరణల ప్రదాత అయిన 'పెరుంతలైవర్ కామరాజర్ అల్పాహార పథకం'గా మారుస్తున్నట్లు ప్రకటించారు. చెన్నైలోని తిరువాన్మియూర్‌లో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో సీఎం విజయ్ ఈ విస్తరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, వారితో కలిసి కూర్చొని భోజనం చేశారు. ఈ విస్తరణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15,454 ప్రభుత్వ, ప్రభుత్వఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 15.3 లక్షల మంది విద్యార్థులు అదనంగా లబ్ధి పొందనున్నారు. ఈ పథకం కింద మొత్తం ప్రయోజనం పొందేవారి సంఖ్య 34.64 లక్షలకు చేరనుంది. పథకం విస్తరణ కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం అదనంగా రూ. 217.63 కోట్లను కేటాయించింది. దీంతో ఈ పథకం మొత్తం వార్షిక బడ్జెట్ సుమారు రూ. 724 కోట్లకు పెరిగింది. వాస్తవానికి ఈ అల్పాహార పథకాన్ని 2022లో గత డీఎంకే ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎం.కె. స్టాలిన్ ప్రాథమిక తరగతుల కోసం ప్రారంభించారు. ఇప్పుడు విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించడమే కాకుండా, దాని పరిధిని పెంచి దివంగత నేత కామరాజర్ పేరు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు ప్రారంభమైనప్పటికీ, కొన్ని జిల్లాల్లో ఉపఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అక్కడ తాత్కాలికంగా వాయిదా వేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఆద్యుడిగా పేరుగాంచిన కామరాజర్ పేరును ఈ పథకానికి పెట్టడం ద్వారా ఆయన వారసత్వాన్ని గౌరవించినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## కర్ణాటకలో 'వందేమాతరం' వివాదం.. డీకే శివకుమార్ ప్రభుత్వానికి గవర్నర్ వార్నింగ్

జాతీయ గీతం 'వందేమాతరం' గానంపై కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని కేవలం రెండు చరణాలకే పరిమితం చేయడాన్ని తప్పుబడుతూ ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని, వీటిని వెంటనే పునఃపరిశీలించాలని ఆయన కోరారు. 2026 సెప్టెంబర్ 8వ తేదీన కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని



లేదా గవర్నర్ హాజరయ్యే కార్యక్రమాలు మినహా, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతంలోని మొదటి రెండు చరణాలు మాత్రమే పాడాలని అందులో పేర్కొంది. అయితే, జాతీయ గౌరవ పరిరక్షణ చట్టం 2026 సవరణ ప్రకారం జాతీయ గీతానికి కూడా చట్టబద్ధమైన రక్షణ ఉందని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు, జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని గవర్నర్ తన లేఖలో స్పష్టం చేశారు. జాతీయ చిహ్నాలపై నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి శాసన, కార్యనిర్వాహక అధికారాలు లేవని రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 162, 256, 257(1)ను ఆయన ఉటంకించారు. ఈ ఉత్తర్వులను ఇలాగే కొనసాగిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనవసర వివాదాలు తలెత్తడమే కాకుండా, రాజ్యాంగపరమైన చిక్కులకు దారితీస్తుందని గవర్నర్ హెచ్చరించారు.

## సంపాదకీయం

# పారిశ్రామిక వికాసమా?
# కార్పొరేట్ ఫాసిజమా?

పీవీ నరసింహారావు భారతదేశంలో సరళీకృత ఆర్థిక విధానాలకు తెర తీశారు; అయితే అనుకున్నంతగా ఫలితాలు సాధించలేదు, ఆశించినంత స్థాయిలో పెట్టుబడులు రాలేదు. ఆ విషయమై ఒక ఇంటర్వ్యూలో లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ గారిని అడిగితే—విదేశీ పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడానికి ప్రధాన కారణం భారతదేశంలో అప్పటికి అమలవుతున్న కార్మిక చట్టాలు కాగా, మరొక కారణం భూమి విలువ అని చెప్పారు. ప్రపంచంలోనే భూమి విలువ ఎక్కువగా ఉన్న దేశాలలో భారతదేశం ఒకటి. పరిశ్రమ స్థాపించడానికి అయ్యే పెట్టుబడిలో సింహభాగం భూమికే కేటాయిస్తే, లాభాల బాట పట్టడానికి చాలా సమయం పడుతుందనే ఆలోచన వారిని ముందుకు సాగనీయలేదనేది దాని సారాంశం. దానికితోడు కొద్దిగా సోషలిస్టు తరహా కార్మిక చట్టాలు; కార్మికుల హక్కుల పోరాటాలు అంటే పెట్టుబడిదారులకు ఎప్పుడూ భయమే. కేంద్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలను సరళీకరించాయి కానీ, భూములు కేటాయించి అయినా పరిశ్రమలు తీసుకురావాలనే ఆలోచనపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. అయితే పరిశ్రమలు వస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి; ఉపాధి ఉన్నచోట జనసాంద్రత పెరుగుతుంది, సైబరాబాద్ లాంటి నగరాలు ఏర్పడతాయి, తద్వారా రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుంది. భూములు కొని మరీ పెట్టుబడులు పెట్టడం భారమని అర్థం చేసుకున్న చంద్రబాబు నాయుడు, పెట్టుబడిదారులకు భూములు కేటాయించి అయినా పెట్టుబడులను ఆకర్షించాలనుకున్నారు. ఆ ఆలోచనలలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో ఆయన రెండు పద్ధతులలో భూములను కేటాయించారు. మొదటి విధానంలో రాయితీ ధరలకు అమ్మడం జరిగింది. అందులో భాగంగా ఐటీ రంగానికి, మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజ సంస్థలకు మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు ఏపీఐఐసీ ద్వారా ఉమ్మడి హక్కులతో భూములను విక్రయించారు. దానితో హైదరాబాద్‌లో ఐటీ రంగం ఊపందుకుంది. విద్యాసంస్థలకు, ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రాజెక్టులకు, మౌలిక వసతుల కోసం భూములను 33, 66 లేదా 99 సంవత్సరాల దీర్ఘకాలిక లీజు పద్ధతిలో కేటాయించారు. అలాంటి విద్యాసంస్థల్లో ఐఎస్‌బీ వంటి సంస్థలు ఉన్నాయి. హైటెక్ సిటీ కోసం పీపీపీ పద్ధతిని అనుసరించారు. కేటాయింపు ప్రాతిపదిక నిర్ణయం వెనుక సంస్థ రకం, కల్పించే ఉద్యోగాల సంఖ్య, తీసుకొచ్చే పెట్టుబడి పరిమాణం వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఒక్క శంషాబాద్ విమానాశ్రయానికి మాత్రమే వేల ఎకరాల భూమిని కేటాయించారు; మిగిలిన సంస్థలన్నింటికీ వందల్లో, యాభైల్లో మాత్రమే ఎకరాలను కేటాయించారు. ఆ రోజుల్లో కేటాయించబడిన భూముల్లోకి ఆ సంస్థలన్నీ వచ్చి చేరి, నేడు హైదరాబాద్ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆ తరువాత వచ్చిన వై.ఎస్. రాజశేఖర రెడ్డి తన కుమారుడి స్వంత లాభం కోసం ఒక్కో సంస్థకు వేలాది ఎకరాల భూమిని కేటాయించారు. వాన్‌పిక్ సంస్థకు ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో 28,000 ఎకరాలు, బ్రాహ్మణి స్టీల్స్‌కు కడప జిల్లా జమ్మలమడుగు వద్ద 14,000 ఎకరాలు, కాకినాడ సెజ్‌కు 10,000 ఎకరాలు, లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు 8,844 ఎకరాలు, తన కుమారుడి సంస్థ అయిన భారతి సిమెంట్స్‌కు లైమ్‌స్టోన్ గనుల కోసం 2,038 ఎకరాలు కేటాయించారు. అందులో ఒక్క సంస్థ కూడా పనులు ప్రారంభించలేదు, ఉపాధి కల్పించనూ లేదు. అలా అధికార దుర్వినియోగం చేసి రాజకీయాలను, రియల్ ఎస్టేట్‌ను దొడ్డిదారిన ముడిపెట్టారు. తరువాత విభజిత ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు 2014-2019 మధ్య కాలంలో ప్రముఖ విద్యాసంస్థలకు, కియా మోటార్స్ లాంటి సంస్థలకు భూములు కేటాయించారు కానీ, అవి వందల ఎకరాలకే పరిమితమయ్యాయి. అయితే 2019-2024 మధ్య కాలంలో వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అదానీ గ్రూపుకు, ఇండోసోల్ సంస్థకు వేల ఎకరాలు కేటాయించారు. ఆ సంస్థలు కల్పించే ఉపాధికీ, వాటికి కేటాయించిన భూమికి పొంతనే లేదు. ఇండోసోల్‌కు కేటాయించిన 8,000 ఎకరాలలో వారి ప్రతిపాదిత ప్లాంటుకు 500 ఎకరాలే ఎక్కువ. అదానీలకు కేటాయించిన భూమి విషయంలోనూ అంతే. భవిష్యత్తులో విస్తరిస్తామని ప్రతిపాదించినందువల్లనే ఇన్ని వేల ఎకరాలు అవసరమని చెబుతారు; కానీ ఇది పూర్తిగా అవాస్తవం. వారు కల్పించే ఉపాధి కూడా లెక్కల గారడీ మాత్రమే; ప్రాజెక్టుల నిర్మాణ దశలో లభించే తాత్కాలిక ఉపాధి మాత్రమే దొరుకుతుంది. ఈ విషయాలు ఇప్పటి కూటమి ప్రభుత్వానికీ తెలుసు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు ఈ కేటాయింపులను ఎత్తిచూపినవారే. కానీ ఆ కంపెనీల వెనుక ఉన్న బలీయమైన శక్తి ఏమిటనేది చెప్పకుండా, కూటమి ప్రభుత్వం కూడా నేడు వాటికి కేటాయించిన భూముల్లో మార్పులు చేర్పులు చేయడమే తప్ప కేటాయింపులను రద్దు చేయలేదు. అలా చేయకపోవడం చంద్రబాబు నాయుడి దార్శనికతకు సవాలుగానే మిగులుతుంది. దేశంలో కార్పొరేట్ శక్తులు బలమైన రాజకీయ అండదండలను అడ్డుపెట్టుకుని భూమిని చెరపట్టడం సర్వసాధారణమైపోయింది. కార్పొరేట్ శక్తులు తాము స్థాపించబోయే తయారీ సంస్థల విస్తీర్ణం కన్నా రెట్టింపు కంటే ఎక్కువ భూమిని సేకరిస్తున్నాయి. అదే సమయంలో వ్యవసాయదారులు తమ భూములను కోల్పోయి కూలీలుగా మారుతున్నారు. ఒకనాడు మన దేశంలో భూమిని కొని పెట్టుబడి పెట్టడానికి సంకోచించి వెనక్కి తగ్గిన పెట్టుబడిదారులు, నేడు ప్రభుత్వ అండతో భూములను ఆక్రమించుకుంటున్నారే తప్ప కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వ రంగాన్ని తొక్కిపట్టేసిన ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులకు పన్ను మినహాయింపుల నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీల రద్దు వరకు రాయితీలు, ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్స్) అందిస్తున్నాయి. 140 కోట్ల ప్రజలకు హక్కు ఉన్న భూమిని కొద్దిమంది కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రజలను దివాలా తీయిస్తున్నారు. పరిశ్రమ పెడతామన్న పేరుతో చౌకగా వేల ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్డ్ భూములను పొంది, ఆ తరువాత ఆ భూముల విలువ పెరిగిన కొద్దీ వాటిపై బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని ఇతర వ్యాపారాలకు మళ్లిస్తున్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మన దేశానికి రాకపోయినా, మన భూముల ద్వారా లబ్ధి పొందిన కంపెనీలు మాత్రం విదేశాలలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ కేటాయింపుల ద్వారా లబ్ధి పొందిన కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లు, ఫండింగ్ లేదా 'క్విడ్ ప్రో కో' రూపంలో రాజకీయ పార్టీలకు ఆర్థిక సహాయం చేస్తున్నాయి. ఈ విధానం వలన సంపద కొద్దిమంది పారిశ్రామికవేత్తల చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. వేలాది మంది చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోయి కూలీలుగా మారుతుంటే, పదేళ్ల క్రితం ఏమీ లేని కంపెనీలు వేల కోట్ల ఆస్తులకు అధిపతులవుతున్నాయి. సమాజంలో పేద, ధనిక వ్యత్యాసాలు విపరీతంగా పెరగడానికి ఇది కారణమవుతోంది. పారిశ్రామికీకరణ, సాంకేతిక పురోగతి, ఉద్యోగాల కల్పన అనేవి రాష్ట్ర ప్రగతికి అత్యంత ఆవశ్యకం. అయితే సముచితమైన భూపరిమితి, పారదర్శకమైన ప్రజాభిప్రాయ సేకరణ లేనప్పుడు అది పారిశ్రామిక వికాసం కాకుండా కేవలం కార్పొరేట్ అనుకూల విధానంగా మారిపోతుంది. చంద్రబాబు నాయుడు ఒప్పకున్నా ఒప్పకోకపోయినా, దీనిని 'కార్పొరేట్ ఫాసిజం' అని భావించక తప్పదు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 23

SEPTEMBER 23

* 1902: ప్రసిద్ధ రంగస్థల నటుడు స్థానం నరసింహారావు జననం (మ.1971).
* 1917: ప్రముఖ భారతీయ రసాయన శాస్త్రవేత్త అసీమా ఛటర్జీ జననం (మ.2006).
* 1922: ప్రసిద్ధ వైణికుడు ఈమని శంకరశాస్త్రి జననం (మ.1987).
* 1985: భారతదేశ ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు అంబటి రాయుడు జననం.(చిత్రంలో)
* 1987: భారతీయ గాయకుడు రాహుల్ వైద్య జననం.
* 2010: భారత ఆర్థిక వేత్త, సామాజిక శాస్త్రవేత్త భావరాజు సర్వేశ్వరరావు మరణం (జ.1915).
* 2010: స్వాతంత్ర్య సమరయోధుడు, దర్శకుడు,


అంబటి రాయుడు

నిర్మాత కె.బి. తిలక్ మరణం (జ.1926).
* 1803: రెండవ ఆంగ్లో-మరాఠా యుద్ధం, అస్సాయే యుద్ధం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ, భారతదేశంలోని మరాఠా సామ్రాజ్యం మధ్య జరిగింది.

### తుపాను హెచ్చరిక సందేశాలను పంపిస్తూ
## ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి: హోంమంత్రి

విశాఖ: రానున్న రెండు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో హోంమంత్రి అనిత వాయుగుండం పరిస్థితులపై ఎప్పకటిప్పుడు ఆరా తీస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని.. జాగ్రత్తగా ఉండాలన్నారు. వచ్చే మూడు రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభావిత జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తుపానుపై ఎప్పటికప్పుడు ప్రజలకు హెచ్చరిక సందేశాలు పంపిస్తూ ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అధికార యంత్రాంగం విపత్తుల సంస్థ, ఆర్‌టీజీఎస్‌తో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వాగులు, కాజ్‌వేల వద్ద




హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎలాంటి సహాయం కావాలన్నా 112, 1070, 18004250101 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతోన్న వాయుగుండం మరికొన్ని గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ వెల్లడించింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత విశాఖపట్నం గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశముందని తెలిపింది.

### భారీ వర్షాలు.. డిప్యూటీ సీఎం పవన్
## మన్యం జిల్లా పర్యటన మళ్లీ వాయిదా

బలిజిపేట: పార్వతీపురం మన్యం జిల్లా పెదపెంకిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన మరోసారి వాయిదా పడింది. ఈ నెల 24న పెదపెంకిలో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సి ఉండగా.. భారీ వర్షాల నేపథ్యంలో పర్యటన వాయిదా వేసుకున్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం పేషీ నుంచి కలెక్టర్‌కు సమాచారం అందింది. తదుపరి పర్యటన షెడ్యూల్‌ను త్వరలోనే ఖరారు చేయనున్నట్లు తెలిపారు. పెదపెంకి గ్రామంలో వందకు పైగా ఫైలేరియా కేసులు నమోదవడం, తరచూ ప్రజలు ప్రమాదకర జ్వరాల బారిన పడుతుండటంతో పవన్ అక్కడి సమస్యలపై దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. బలిజిపేట మండలం



పెదపెంకి, తదితర ప్రాంతాలను సందర్శించి మ్యాజిక్ డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో మూడోసారి ఆయన పర్యటన వాయిదా పడింది.

## హైదరాబాద్ వినాయకుడు.. విజయవాడలో నిమజ్జనం!

అమరావతి: వినాయకచవితి సందర్భంగా మండపం ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో గణనాథుడికి పూజలు చేసి విగ్రహం నిమజ్జన సమయంలో మాత్రం డీజేలు, భారీ శబ్దాల స్పీకర్లు, లైటింగ్ ఏర్పాటు చేసి హడావుడి చేయడం చూసి ఉంటాం. కానీ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన క్రాంతి యువజన సంఘం సభ్యులు దీనికి భిన్నంగా ఏటా వినాయకుడిని నిమజ్జనం చేయడానికి ఏదో ఒక పుణ్యక్షేత్రాన్ని ఎంచుకుంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. దాదాపు 30 మందికిపైగా మంగళవారం తెల్లవారుజామున 4:30కి వనస్థలిపురంలో బయలుదేరి మధ్యాహ్నం విజయవాడ ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణానదిలో నిమజ్జనం జరిగే ప్రదేశానికి వినాయకుడి విగ్రహాన్ని తీసుకొచ్చారు. అక్కడ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన క్రేన్



సాయంతో కృష్ణమ్మ ఒడిలోకి స్వామిని పంపి దుర్గమ్మ దర్శనానికి బయలుదేరారు. దాదాపు 15 ఏళ్లుగా ఏటా వినాయక నిమజ్జనానికి విజయవాడ, భద్రాచలం, నాగార్జునసాగర్, శ్రీశైలం.. ఇలా ఏదో ఒక పుణ్యక్షేత్రానికి తీసుకెళ్లి నిమజ్జనం చేసి, అక్కడ ఉన్న ప్రధాన ఆలయాలన్నీ దర్శించుకుని వెళ్తామని వారు చెప్పారు.

# 'ఇంత పెద్ద ఆరోపణలు వస్తున్నా ఎందుకు మౌనం?'.. జగన్‌పై అచ్చెన్నాయుడు ఫైర్

- **మద్యం కుంభకోణంపై జగన్ స్పందించాలన్న అచ్చెన్న**
- **రూ.3,200 కోట్ల అక్రమాలు జరిగాయని ఆరోపణ**
- **సత్యప్రసాద్ వాంగ్మూలాన్ని ప్రస్తావించిన మంత్రి**
- **జగన్ నివాసంలో నిర్ణయాలు జరిగాయని వాంగ్మూలం**
- **నగదు లావాదేవీలపై అచ్చెన్న ప్రశ్నలు**

మద్యం కుంభకోణం ఆరోపణలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. 2019 ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చిన జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహించారని విమర్శించారు. ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలో ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అచ్చెన్నాయుడు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంలో రూ.3,200 కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం సిట్ దర్యాప్తు చేపట్టిందని చెప్పారు. సిట్ దర్యాప్తులో మద్యం విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలపై పలు అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. మాజీ ఏపీఎస్‌బీసీఎల్ ఓఎస్డీ డి.సత్యప్రసాద్ ఏసీబీ కోర్టులో ఇచ్చిన వాంగ్మూలాన్ని అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. మద్యం విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలు అప్పటి ముఖ్యమంత్రి నివాసంలోనే తీసుకున్నట్లు ఆయన వాంగ్మూలంలో పేర్కొన్నారని చెప్పారు. ఈ ఆరోపణలపై జగన్ స్పందించాలని డిమాండ్ చేశారు. సత్యప్రసాద్ గతంలో ప్రభుత్వ వ్యవస్థలో కీలక బాధ్యతల్లో పనిచేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇప్పుడు ఆయన వాంగ్మూలాన్ని ప్రశ్నించడం సరికాదని అన్నారు. మద్యం సరఫరాలో నగదు లావాదేవీలపై కూడా అచ్చెన్నాయుడు ప్రశ్నలు లేవనెత్తారు. 2019 24 మధ్య మద్యం విక్రయాలు, బ్రాండ్ల ఎంపిక, సరఫరా విధానంలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మద్యం రవాణా కాంట్రాక్టుల్లోనూ అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. రవాణా టెండర్లలో అవకతవకలతో రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.192 కోట్ల నష్టం జరిగిందన్న దర్యాప్తు ఆరోపణలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఆరోపణలపైనా జగన్ సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు కోరారు. మద్యం విధానంలో జరిగినట్లు చెబుతున్న అక్రమాలు, నగదు లావాదేవీలు, సరఫరా వ్యవహారాలపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ''ఇంత పెద్ద ఆరోపణలు వస్తున్నా ఎందుకు స్పందించడం లేదు?'' అంటూ ప్రశ్నించారు.



## క్యాన్సర్ గుర్తింపు కోసం ఇంటిగ్రేటెడ్ జీనోమిక్స్ సొల్యూషన్ సెంటర్: మంత్రి సత్యకుమార్



గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌ను క్యాన్సర్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో 8.74లక్షల మంది క్యాన్సర్ బారిన పడ్డారని, అందుకే ఈ రోగ నివారణ కోసం సీఎం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని చెప్పారు. జన్యుపరంగా వస్తున్న క్యాన్సర్ గుర్తింపు కోసం గుంటూరులో ఇంటిగ్రేటెడ్ జీనోమిక్స్ సొల్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ''ఏపీలోనే మొదటిసారిగా గుంటూరులో ఇంటిగ్రేటెడ్ జీనోమిక్స్ సొల్యూషన్ సెంటర్‌ను ప్రారంభించాం. ఓరల్, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం ప్రజలు ముందుకు వస్తున్నారు. కానీ, కొన్ని అపోహల కారణంగా సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం ప్రజలు ముందుకు రావట్లేదు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రూ.120 కోట్లతో కర్నూల్‌లో క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో క్యాన్సర్ నివారణ కోసం రూ. 1500 కోట్లు ఖర్చు చేసింది''అని మంత్రి సత్యకుమార్ తెలిపారు.



## విజయ డెయిరీ
## నూతన ఛైర్మన్‌గా దాసరి బాలవర్ధనరావు

విజయవాడ: కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి విజయ డెయిరీ నూతన ఛైర్మన్‌గా దాసరి వెంకట బాలవర్ధనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల చలసాని ఆంజనేయులు డెయిరీ ఛైర్మన్ పదవితోపాటు డైరెక్టర్ పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో డెయిరీ నూతన ఛైర్మన్ ఎన్నిక విషయంలో అనేక ఊహాగానాలు తలెత్తాయి. వీటన్నింటినీ తోసిపుచ్చుతూ రెండు సార్లు శాసనసభ్యునిగా... 15ఏళ్లుగా పాల సొసైటీ డైరెక్టర్‌గా వ్యవహరించిన సీనియర్ తెలుగుదేశం నాయకులు బాలవర్ధనరావుకు ఛైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం భావించింది. ఇవాళ విజయ డెయిరీ కార్యాలయంలో సమావేశమైన డైరెక్టర్లు.. బాలవర్ధనరావు పేరును సామూహికంగా ప్రతిపాదిస్తూ ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం నూతన ఛైర్మన్‌గా బాలవర్ధనరావు లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా రాజకీయాల్లో, తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన గన్నవరం నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా 1999, 2009లో గెలుపొందారు. విజయ డెయిరీలో డైరెక్టరుగా అనుభవాన్ని, పార్టీకి చేస్తోన్న సేవలను గుర్తించి ఛైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు బాలవర్ధనరావు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని పాడి రైతుల సంక్షేమానికి, విజయ డెయిరీని మరింత లాభాల బాటలో నడిపించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా.. 20 మందికి తీవ్ర గాయాలు



వాల్మీకిపురం: అన్నమయ్య జిల్లాలో టైరు పంక్చరై ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. వాల్మీకిపురం మండలం విఠలం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో 20 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మదనపల్లె ఆర్టీసీ డిపోనకు చెందిన నాన్‌స్టాప్ బస్సు మంగళవారం ఉదయం తిరుపతికి బయల్దేరింది. వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలో మదనపల్లెతిరుపతి హైవేపై ప్రయాణిస్తుండగా టైరు పంక్చర్ కావడంతో పక్కనే ఉన్న కల్వర్టులోకి వెళ్లి బస్సు బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 20 మందిని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో కొంతమందిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై తిప్పేస్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఉత్తరాంధ్రకు వాయు'గండం'..
# విజయనగరం జిల్లాలో పాఠశాలలకు సెలవు



విశాఖపట్నం: బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. మరి కొన్ని గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ వెల్లడించింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత విశాఖపట్నం గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశమున్నట్లు తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర జిల్లాల్లో ఇవాళ, రేపు భారీ వర్షాలు (Heavy rain) కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 70కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ మూడు జిల్లాల్లో సుమారు 20 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని అధికారులు అంచనావేస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

**3 జిల్లాలకు రెడ్ అలర్ట్**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లాల యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. రెండు జిల్లాల పరిధిలో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డిలు సంబంధిత అధికారులకు సూచించారు. 24గంటలు పనిచేసేలా రెండు జిల్లాల కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ప్రజలు ఎలాంటి సహాయం కోసమైనా, సమాచారం అందించడానికైనా విజయనగరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08922236947 నంబరు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08963450347 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు. వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా భోగాపురం, పూసపాటిరేగ మండలాల తీరప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తీర ప్రాంత ప్రజల సౌకర్యార్థం 9 సచివాలయాల పరిధిలో పునరావాస కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. విజయనగరం జిల్లాలో బుధవారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం చంద్రంపేట వసంత గ్రామాల మధ్య రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా గింజేరు గెడ్డకు భారీగా వరద నీరు రావడంతో రహదారిపై రాకపోకలు నిలిపివేశారు.

**విశాఖలో విద్యాసంస్థలకు సెలవు**

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటించినట్లు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి N.ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్, ఇతర డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ అభిషిక్త కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ చెప్పారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 0891 2590100, 08912590102, జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్ 180042500009, వాట్సాప్ నెం.9014218870, విశాఖపట్నం ఆర్డీవో కార్యాలయం08912562977, భీమిలి ఆర్డీవో కార్యాలయం 9014093139 నంబర్లకు అత్యవసర సాయం కోసం ఫోన్ చేయాలని సూచించారు.

## నాపై సోషల్ మీడియాలో అల్లుతున్నవి కట్టుకథలు: షర్మిల



అమరావతి: తనపై సోషల్ మీడియాలో అల్లుతున్నవి కట్టుకథలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. కుమార్తె వివాహాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయాల్సిన ఖర్మ తనకు లేదన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేశారు. ''నేను ఎవరినో కలిసినట్లు, ఎక్కడో చేరిపోతున్నట్లు నాపై సోషల్ మీడియాలో అల్లుతున్నవి కట్టుకథలు. చేస్తున్న విశ్లేషణలు పూర్తిగా నిరాధారం.. జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధం. నేనంటే గిట్టని వాళ్లు చేస్తున్నవి పసలేని ఆరోపణలు. వాటిని తీవ్రంగా ఖండిస్తున్నా. వైకాపా అధ్యక్షుడు జగన్ ను నేను చివరిసారిగా కలిసింది నా కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించిన సమయంలోనే. మళ్లీ ఇప్పుడు కలిసినా.. నా కుమార్తె వైఎస్ అంజలిరెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందించడానికి మాత్రమే. అన్ని రాజకీయ పార్టీల అధినేతలను నా బిడ్డ పెళ్లికి రావాలని ఆహ్వానిస్తాను. ఇందులో కొత్తేం లేదు .. వింత అంతకన్నా కాదు. కన్న కుమార్తె వివాహాన్ని అడ్డుపెట్టుకొని తెర వెనుక రాజకీయాలు చేసుకునే ఖర్మ నాకు లేదు. శుభకార్యానికి, రాజకీయానికి లింకులు పెట్టి నా విశ్వసనీయత, ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదు''అని షర్మిల పేర్కొన్నారు.

## పిఠాపురంలో రూ.1,500 కోట్ల అభివృద్ధి పండుగ
# నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామన్న పవన్

- **చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్న పవన్ కల్యాణ్**
- **కొత్తగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హాలు పనులను పరిశీలించిన పవన్**
- **నాగులపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం**

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండో రోజు విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుతో పాటు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు రూ.1,500 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పర్యటనలో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకుని, ఏకాదశి వ్రతాచరణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి కేటాయించిన రూ.90 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హాలు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం యు.కొత్తపల్లి మండలంలో రూ.9.59 కోట్లతో పునరుద్ధరించిన నాగులపల్లి



సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించి, 52 ఆవాసాలలోని సుమారు 97 వేల మంది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. కొండేవారంలో ఇంటింటి కుళాయి కనెక్షన్లను స్వయంగా పరిశీలించారు. ఆర్ఆర్ బీహెచ్ఆర్ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్, స్వయం సహాయక సంఘాలకు రూ.120 కోట్ల రుణాల చెక్కులు, లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ ఇళ్ల పట్టాలు, మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, పదో తరగతి ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. పిఠాపురం పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం, రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, రూ.34 కోట్లతో దేవాలయాల పునరుద్ధరణ, రూ.323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి కీలక ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులు పవన్ కల్యాణ్‌కు నాగలిని కానుకగా ఇచ్చి తమ కృతజ్ఞతలు తెలిపారు.

## గొడ్డలి పార్టీ తన వైఖరిని, 'రప్పా రప్పా' సంస్కృతిని బయటపెట్టుకుంది: నిమ్మల రామానాయుడు

- **టీచర్లపై వైసీపీ శ్రేణుల దాడిని ఖండిస్తున్నానన్న నిమ్మల రామానాయుడు**
- **గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను రెచ్చగొట్టి దాడులు చేయించారని మండిపాటు**
- **డీఎస్సీపై జగన్ ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని ఆగ్రహం**

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... విజయవాడ శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై వైసీపీ జరిపిన భౌతిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. ప్రతిపక్ష పార్టీ మళ్లీ తన 'గొడ్డలి పార్టీ' వైఖరిని, 'రప్పా రప్పా' సంస్కృతిని బయటపెట్టుకుందని ధ్వజమెత్తారు. సమాజంలో అత్యున్నత గౌరవం పొందాల్సిన ఉపాధ్యాయులపై గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను, రౌడీ మూకలను రెచ్చగొట్టి దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ప్రకాశం, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి రౌడీలను విజయవాడకు తెప్పించి, కష్టపడి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసేలా దాడులకు తెగబడ్డారని ఆరోపించారు.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- **హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం**
- **వాయుగుండం ప్రభావంతో తెలంగాణకు రెండు రోజుల వర్ష సూచన**
- **ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 20 జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక**
- **అధికారులను అప్రమత్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి,



ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది.

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నీటి విషయంలో తెలంగాణను ముంచింది
## బీఆర్ఎస్ కాదా?: కాంగ్రెస్

హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని, కావాలనే రైతులను రెచ్చగొడుతున్నారని మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆక్షేపించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. నీళ్ల కోసం కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తున్నామని చెప్పారు. జూరాల డ్యామ్ వద్ద బీఆర్ఎస్ చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదని మంత్రి వాకిటి మండిపడ్డారు. "ప్రస్తుతం నీరు ఎంత అందుబాటులో ఉంది? తాగునీటి అవసరాల కోసం ఎంత నీరు అవసరమో తెలుసా? రైతులకు మేలు జరగాలనే ఉద్దేశం బీఆర్ఎస్ నేతలకు లేదు. 811 టీఎంసీల్లో 299 టీఎంసీలు సరిపోతాయని నాడు మీరు చెప్పలేదా? నీటి విషయంలో రాష్ట్రాన్ని ముంచింది ఎవరు? రాష్ట్ర రైతులపట్ల మరణశాసనం రాసింది మీరు. రైతులు, వ్యవసాయ పేటెంట్ కాంగ్రెస్‌దే" అని వాకిటి శ్రీహరి అన్నారు. నోటికి ఎంతొస్తే అంత మాటలా? మంత్రి జూపల్లి బీఆర్ఎస్ నేతలు నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. కర్ణాటక ప్రభుత్వం కాళ్లు పట్టుకోవాలని బీఆర్ఎస్ అంటోందన్న ఆయన.. రైతుల కోసం కాళ్లు మొక్కితే



తప్పేముందని ప్రశ్నించారు. " నీటి అంశంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తున్నాం. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ కూడా రాశాం. రేపు నీళ్లు తీసుకురాబోతున్నామని బీఆర్ఎస్‌కు తెలుసు. అందుకే ఆ పార్టీ నేతలు ఇవాళ హడావుడి చేస్తున్నారు. రైతులను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పాలమూరు జిల్లా గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు. అబద్ధాలను ప్రజలు నమ్ముతారని ఆ పార్టీ భ్రమల్లో ఉంది. గత ప్రభుత్వం జూరాలలో ఎందుకు పూడిక తీయలేదు. అందుకే జూరాలలో ఎంత నీరు ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎల్‌నినో పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సలహాలు ఇవ్వండి. అంతేతప్పు.. అవసరాన్ని అవకాశంగా వాడుకోవద్దు" అని జూపల్లి మండిపడ్డారు.

## నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు.. రూ.80కోట్ల ఆస్తుల గుర్తింపు

హైదరాబాద్: నిమ్స్ వైద్యుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ వద్ద భారీగా ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. లక్ష్మీ భాస్కర్ నివాసంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు.. దాదాపు రూ.80 కోట్లకుపైగా విలువైన స్థిర, చరాస్తులను గుర్తించినట్టు సమాచారం. కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీర్‌బాద్, కూకట్‌పల్లిలో 5 అపార్ట్‌మెంట్లలో



ఫ్లాట్లు, యాదాద్రి, నందిగామ, శామీర్‌పేట ప్రాంతాల్లో 4 ఓపెన్ ప్లాట్లు, విశాఖలో 800 గజాల స్థలం, బ్యాంకు ఖాతాల్లో రూ.41లక్షలు, పోస్టాఫీస్ ఖాతాల్లో రూ.12 లక్షల డిపాజిట్లు, ప్రైవేటు సంస్థలో రూ.35లక్షల మేర పెట్టుబడులతో పాటు 517 గ్రాముల బంగారం, 3 కార్లు, 4 బైక్‌లు ఉన్నట్టు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో ఆయన ఆస్తుల విలువ రూ.80 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు. సోదాల అనంతరం లక్ష్మీభాస్కర్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. నిమ్స్‌లో డా.లక్ష్మీభాస్కర్ సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి.

## రిమ్స్ ఆసుపత్రిని పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ

ఆదిలాబాద్ వైద్య విభాగం: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని పిల్లల వార్డులో షర్ట్ సర్క్యూట్ జరిగిన ప్రాంతాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరిశీలించారు. సోమవారం రాత్రి ఎస్ఎంసీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు శిశువులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నవజాత శిశువుల వార్డులో జరిగిన ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదం గురించి జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్‌లో అధికారులతో అంతర్గత సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, డీఎంఈ వాణి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ మంద మకరందు, డీఎంహెచ్ఓ సాధన, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.



## కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రులు..
## ఎమ్మెల్యేల బృందం భేటీ

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పలువురు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, ముధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు కృష్ణా జలాలు విడుదల చేయాలని వారు కోరారు. నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతుల దుస్థితిని డీకేకు వివరించారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ 4 ప్రాజెక్టుల కింద 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోందని వివరించారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని పంటలు కీలక దశలో ఉన్నాయని.. నీటి కొరత వస్తే పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని



వివరించారు. అంతేకాకుండా రైతుల ఆదాయం, జీవనోపాధిపై ప్రభావం పడుతుందని మంత్రులు తెలిపారు. నెలలో 5 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలు విడుదల చేయాలని కోరారు. మంత్రుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం డీకే శివకుమార్.. తెలంగాణ రైతులకు లాభం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో ఘోర విషాదం.. అగ్నిప్రమాదంలో ఇద్దరు పసికందుల మృతి

- **ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఘోర అగ్నిప్రమాదం**
- **ఎస్ఎన్‌సీయూ వార్డులో మంటలు చెలరేగి ఇద్దరు శిశువుల మృతి**
- **28 మంది చిన్నారులను సురక్షితంగా కాపాడిన సిబ్బంది**
- **షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా**
- **ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి, విచారణకు ఆదేశం**

తెలంగాణలోని ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో సోమవారం అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో అగ్నిప్రమాదం జరగడంతో ఇద్దరు నవజాత శిశువులు మరణించారు. అప్రమత్తమైన సిబ్బంది వార్డులోని మరో 28 మంది చిన్నారులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి సుమారు 11:50 గంటల సమయంలో ఈ ప్రమాదం



జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు భావిస్తున్నారు. కొద్దిసేపట్లోనే వార్డు మొత్తం దట్టమైన పొగ, అగ్నికీలలతో నిండిపోయింది. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ దురదృష్టకర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ముఖ్యంగా ఎస్ఎన్‌సీయూలోని ఎలక్ట్రికల్ వ్యవస్థ, ఏసీ పరికరాలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా? అనే కోణంలో దర్యాప్తు సాగనుంది. ఈ మరణాలకు సిబ్బంది నిర్లక్ష్యం ఏమైనా కారణమా? అనే అంశాన్ని కూడా తేల్చనున్నారు.

* **సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశం**

రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు శిశువులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో ప్రభావితమైన మిగతా చిన్నారులందరికీ అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్ భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న ప్రమాదం జరిగిన రిమ్స్‌ను సందర్శించి విచారం వ్యక్తం చేశారు.


**భారత ప్రభుత్వం**
**మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ**
**ప్రకటన**

నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (NCPCR), న్యూఢిల్లీలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఛైర్‌పర్సన్ ఉద్యోగాన్ని భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరబడుచున్నవి :

2. అర్హత ప్రమాణాలు, వయసు, జీతం మరియు ఇతర అలవెన్స్‌లు మొ॥వి మరియు ఇతర వివరాలను మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ https://wcd.gov.inలో చూడవచ్చును. ఛైర్‌పర్సన్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేయుటలో ఆసక్తి గల మరియు ఉద్యోగం నియామకం కోసం అర్హతా ప్రమాణాలను నెరవేర్చే వ్యక్తులు వార్తాపత్రికలలో ప్రకటన ప్రచురణ తేదీ నుండి 28 రోజులలోగా ncpcrvacancies.wcd.gov.in లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చును.

3. కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వంచే నిధులు సమకూర్చబడిన ఏదేని ఇతర సంస్థ క్రింద పని చేస్తున్న వ్యక్తులు తమ దరఖాస్తును తగు విధానంలో పంపవలెను.

CBC 46101/11/0014/2627 సం/- అండర్ సెక్రటరీ టు ది గవర్నమెంట్ ఆఫ్ ఇండియా

**భారత ప్రభుత్వం**
**మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ**
**ప్రకటన**

దిగువ తెలిపిన రంగాలలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (NCPCR), న్యూఢిల్లీలో సభ్యుల ప్రస్తుతం గల ఆరు (06) ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరబడుచున్నవి :

i) బాలల విద్య
ii) శిశు ఆరోగ్యం, సంరక్షణ, సంక్షేమం లేదా శిశు అభివృద్ధి
iii) నిర్లక్ష్యం చేయబడిన లేదా వెనుకబడిన బాలలు లేదా వికలాంగులైన బాలల జువైనల్ జస్టిస్ లేదా సంరక్షణ
iv) బాల కార్మికులు లేదా బాలల ఇబ్బందుల నిర్మూలన
v) చైల్డ్ సైకాలజీ లేదా సోషియాలజీ
vi) బాలలకు సంబంధించిన చట్టాలు

2. అర్హత ప్రమాణాలు, వయసు, జీతం మరియు ఇతర అలవెన్స్‌లు మొ॥వి మరియు ఇతర వివరాలను మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ https://wcd.gov.inలో చూడవచ్చును. సభ్యుల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేయుటలో ఆసక్తి గల మరియు ఉద్యోగాల నియామకం కోసం అర్హతా ప్రమాణాలను నెరవేర్చే వ్యక్తులు వార్తాపత్రికలలో ప్రకటన ప్రచురణ తేదీ నుండి 28 రోజులలోగా ncpcrvacancies.wcd.gov.in లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చును.

3. కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వంచే నిధులు సమకూర్చబడిన ఏదేని ఇతర సంస్థ క్రింద పని చేస్తున్న వ్యక్తులు తమ దరఖాస్తును తగు విధానంలో పంపవలెను.

CBC 46101/11/0015/2627 సం/- (అఖిలేష్ కుమార్ సింగ్)






**एनटीपीसी NTPC | NTPC లిమిటెడ్**

**ప్రకటన నం. 12/26**

**అసిస్టెంట్ ఆఫీసర్ (కార్పొరేట్ కమ్యూనికేషన్) ఉద్యోగాలు**

**మొత్తం ఖాళీలు:15**

**అర్హత:** ఏదైనా విభాగంలో 60% మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ + మాస్ కమ్యూనికేషన్ / జర్నలిజం / అడ్వర్టైజింగ్ / కమ్యూనికేషన్ / పబ్లిక్ రిలేషన్స్ లేదా వీటి కలయికలో 2 సంవత్సరాల ఫుల్-టైమ్ PG డిగ్రీ / PG డిప్లొమా, అందులో కూడా 60% మార్కులు ఉండాలి.

**వయోపరిమితి:** 29 సంవత్సరాలు

**వేతన శ్రేణి:** ₹30,000 – ₹1,20,000 (E0/IDA)

**దరఖాస్తు రుసుము:**
Gen/EWS/OBC: ₹500
SC/ST/PwBD/XSM & మహిళలు: రుసుము లేదు

**ముఖ్యమైన తేదీలు**
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 21.09.2026
చివరి తేదీ: 05.10.2026

**ఎంపిక విధానం:** రాత పరీక్ష / కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBT) + ఇంటర్వ్యూ*

అధికారిక వెబ్‌సైట్
careers.ntpc.co.in

# వందేమాతరం.. ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుడి వ్యక్తిగతమే: సుప్రీం

పూర్తి వందేమాతరంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగత నిర్ణయమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలు ఆలపించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆరు చరణాలను తప్పనిసరి చేయడంపై ప్రముఖ సంగీత విద్వాంసుడు టి.ఎం. కృష్ణ సుప్రీంకోర్టు లో సవాల్ చేశారు. వందేమాతరంలోని చివరి నాలుగు చరణాల్లో హిందూ దేవతలను ఉద్దేశించిన అంశాలు ఉన్నాయని, వాటిని తప్పనిసరిగా పాడేలా చేయడం రాజ్యాంగంలోని లౌకిక విలువలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా, ఒక నిర్దిష్ట మతపరమైన సందేశాన్ని ప్రోత్సహించేలా చట్ట సవరణ ఉందని ఆయన తరఫు న్యాయవాది



వాదించారు. ఈ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిగింది. పూర్తి చరణాలు పాడని వారిపై చర్యలు తీసుకోలేరని ఈ సందర్భంగా సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసింది. పూర్తి వందేమాతరం పాడని వారిపై కేంద్రం తీసుకునే చర్యల అంశాన్ని పరిశీలించేందుకు అంగీకరించింది. వందేమాతరం సవరణ చట్టం, మార్గదర్శకాలపై రెండు వారాల్లోగా సమాధానం చెప్పాలని కేంద్రానికి నోటీసులు ఇచ్చింది.

## ఆ ఊరిలో ప్రేమ పెళ్లిళ్లపై నిషేధం..

హిసార్: హరియాణా లోని ఓ గ్రామం ప్రేమ పెళ్లిళ్ల పై కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ గ్రామంలో ప్రేమ పెళ్లిళ్లను నిషేధిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు హిసార్ జిల్లాలోని ఆర్యానగర్ గ్రామ పెద్దలు ప్రకటన వెలువరించారు. దీని ప్రకారం..పెద్దలను కాదని వివాహం చేసుకునే యువతీయువకులతో పాటు వారి కుటుంబాలు కూడా సామాజిక బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇటీవల గ్రామంలో మూడు ప్రేమ పెళ్లిళ్ల ఘటలు వెలుగులోకి రావడంతో గ్రామ



పంచాయతీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రేమ వివాహాలు గ్రామ సామాజిక వ్యవస్థకు హాని కలిస్తాయని అభిప్రాయపడింది. ఈ గ్రామంలో పుట్టిపెరిగిన వారిని ఇకపై అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లుగా పరిగణించను న్నట్లు తెలిపింది. ప్రేమ వివాహాల నియంత్రణకు ఊరిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ పంచాయితీ నిర్ణయించినట్లు స్థానిక భాజపా నేత హనుమాన్ వర్మ తెలిపారు. తమ నిర్ణయంతో గ్రామస్థులు ఏకీభవిస్తున్నారో లేదో తెలుసుకోవడానికి ఇంటింటి సర్వే కూడా నిర్వహిస్తామన్నారు.

## పట్టపగలే దోపిడీ.. రోగులను ఇలా ఎలా మోసం చేస్తారు?: సుప్రీం కోర్టు

క్యాన్సర్ మందుల అధిక ధరలపై సుప్రీం కోర్టు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. రిటైలర్లకు కేవలం రూ.2,700కే సరఫరా అవుతున్న ఒక క్యాన్సర్ ఔషధంపై.. రూ.27 వేల ఎంఆర్‌పీ ముద్రించడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఇది అరాచకమని, రోగుల విషయంలో పట్టపగలే జరుగుతున్న దోపిడీ అని పేర్కొంది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండటం ఆశ్చర్యకరమని తెలిపింది. ఔషధాల ధరలపై కఠినమైన నియంత్రణ, జనరిక్ మందులను



సూచించని వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. “క్యాన్సర్ చికిత్సకు వాడే కొన్ని మందుల ఎంఆర్‌పీ ధర.. రిటైలర్లకు ఇచ్చే దాని కన్నా 10 రెట్లు ఎక్కువగా ఉంది. ఇది అరాచకం. దీన్ని దోపిడీ అనకపోతే ఇంకేమంటారు? క్యాన్సర్ చికిత్స కోసం ప్రజలు తమ ఇళ్లు, నగలను అమ్ముకుంటున్నారు. రోగులను ఇలా ఎలా మోసం చేస్తారు?” అని ధర్మాసనం మండిపడింది. ధరల నిర్ణయాన్ని ప్రధాన సమస్యగా పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

## కూలీల శారీరక శ్రమకు సమాజం విలువ ఇవ్వట్లేదు: దిల్లీ హైకోర్టు

దేశంలోని కార్మికులకు అతి తక్కువ వేతనాలు లభిస్తున్నాయని, వారి విషయంలో తగిన శ్రద్ధ లేదని, అలాగే వారి శారీరక శ్రమను గుర్తించి గౌరవించడంలో సమాజం విఫలమైందని దిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. తన నిద్రకు భంగం కలిగించవద్దని కోరిన ఓ కూలీపై దాడి చేసిన కేసులో నిందితునికి ట్రయల్ కోర్టు ఐదేళ్ల జైలుశిక్ష విధించగా.. దాన్ని సవాల్ చేస్తూ దోషి హైకోర్టు (Delhi High Court)లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. “కఠినమైన శారీరక శ్రమ చేసే కూలీలు మరుసటి రోజు పనులకు సిద్ధం కావాలంటే.. రాత్రిపూట ప్రశాంతమైన నిద్ర ఎంతో అవసరం. అయితే.. దేశంలోని కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారింది. వారికి తక్కువ వేతనాలు ఉంటాయి. ఎవరూ వారిని పట్టించుకోరు. పాశ్చాత్య దేశాల్లో శారీరక శ్రమకు తగిన వేతనం, విలువ ఇస్తారు. కానీ.. ఈ విషయంలో మన సమాజం విఫలం కావడం దయనీయం” అని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేసు పూర్వాపరాలు.. 2002లో రాజిందర్ కుమార్ అనే కార్మికుడు దిల్లీలోని చాందినీ చౌక్ మార్కెట్‌లో తాను పనిచేస్తున్న దుకాణం ఆవరణలో నిద్రపోయారు. అయితే, వీర్‌పాల్ అనే వ్యక్తి మరికొందరితో కలిసి సృష్టించిన గొడవతో రాజిందర్ నిద్రకు భంగం కలిగింది. దీంతో వారిని వారించారు. ఆగ్రహించిన వీర్‌పాల్..పదునైన ఆయుధంతో దాడి చేశారు.



దీంతో పాల్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. ట్రయల్ కోర్టు ఐదేళ్ల శిక్ష విధించింది. దీన్ని సవాల్ చేస్తూ దోషి దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆ ఇద్దరికి ఎలాంటి పాత కక్షలు లేవని గుర్తించిన హైకోర్టు.. శిక్షను మూడేళ్లకు కుదించింది.

## నదిలో 5కి.మీ కొట్టుకుపోయిన ఏనుగు పిల్ల..
## ఎలా కాపాడారో చూడండి!

తల్లి నుంచి తప్పిపోయిన ఓ ఏనుగు పిల్ల ప్రమాదవశాత్తు నదిలో పడిపోయింది. గమనించిన మత్స్యకారులు కొన్ని గంటల పాటు శ్రమించి దానిని కాపాడారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలోని బైకంఠపూర్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. అటవీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బైకంఠపూర్ అటవీ ప్రాంతంలో ఓ ఏనుగుల గుంపు తీస్తా నదిని దాటుతుండగా.. నాలుగు రోజుల వయసున్న ఏనుగు పిల్ల తప్పిపోయింది. ఆ సమయంలో నదిలో వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో దాదాపు 5 కి.మీ మేర కొట్టుకుపోయింది. నీటిలో కొట్టుకుపోతున్న ఈ పిల్ల ఏనుగును గమనించిన కొందరు మత్స్యకారులు



తీవ్రంగా శ్రమించి, దానిని సురక్షితంగా పడవలోకి ఎక్కించారు. అటవీ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఏనుగు పిల్లను తమ సంరక్షణలోకి తీసుకున్నారు. అనంతరం తల్లి ఏనుగు జాడ తెలుసుకున్న అధికారులు ఏనుగు పిల్లను దానివద్దకు చేర్చారు.

## తరంగ్ శక్తి విన్యాసాల్లో.. అమెరికా యుద్ధ విమానాలు

అమెరికా అత్యాధునిక స్టెల్త్ యుద్ధవిమానం ఎఫ్35 తొలిసారిగా భారత వాయుసేన నిర్వహించే ‘తరంగ్ శక్తి’ విన్యాసాల్లో పాల్గొననుంది. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 12 వరకు రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పుర్‌లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో రెండో విడత విన్యాసాలు జరగనున్నాయి. అమెరికాతో పాటు ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, యూఏఈలకు చెందిన వాయుసేన బృందాలు



విన్యాసాల్లో పాల్గొంటాయని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (IAF) మంగళవారం వెల్లడించింది. ఎఫ్35తో పాటు ఫ్రాన్స్ రఫేల్, యూఏఈ ఎఫ్16, బంగ్లాదేశ్ సీ130జే విమానాలు రెండు వారాలపాటు విన్యాసాలు నిర్వహించనున్నాయి. భారత్ తరఫున రఫేల్, మిరాజ్ 2000, జాగ్వార్, తేజస్, మిగ్29, సుఖోయ్ 30ఎంకేఐ తదితర విమానాలు పాల్గొంటాయి. దేశ రక్షణ సామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు వివిధ దేశాల వాయుసేనల మధ్య సమన్వయాన్ని పెంపొందించడమే ఈ విన్యాసాల ఉద్దేశమని ఐఏఎఫ్ తెలిపింది. ఏరో ఇండియా 2025లో ఎఫ్35 (F35) పాల్గొన్నప్పటికీ.. తరంగ్ శక్తిలో మాత్రం తొలిసారి ప్రదర్శన ఇవ్వనుంది.

## కావేరీ జలాల వివాదం.. సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు

తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. కర్ణాటకకు 70 టీఎంసీల నీరు అదనంగా కేటాయించాలని కోరుతూ ఒక ప్రైవేటు సంస్థ వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రైవేటు సొసైటీల పిటిషన్లు చెల్లవని స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ పార్టీలు లేక సొసైటీలు జోక్యం చేసుకోలేవని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఇలాంటి పిటిషన్లను విచారిస్తూ పోతే.. వివాదాలు ఇంకెప్పటికి ముగుస్తాయని ప్రశ్నించింది. ఇప్పటికే కావేరీ జలాలపై తమిళనాడు, కర్ణాటక చట్టపరంగా పోరాడుతున్నాయని పేర్కొంది. ఈ వివాదంలో ప్రైవేటు సొసైటీలకు స్థానం లేదని.. రాష్ట్రాలకే మాట్లాడే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది.

## మలేసియాకు వీసా ఫ్రీ ట్రావెల్.. పౌరులకు భారత హైకమిషన్ అడ్వైజరీ

మలేసియా వచ్చే భారత ప్రయాణికులకు కౌలాలంపూర్‌లోని భారత హైకమిషన్ కీలక సూచన చేసింది. మలేసియా అందిస్తున్న 30 రోజుల వీసా ఫ్రీ ట్రావెల్‌ను దుర్వినియోగం చేయొద్దని సూచించింది. దాన్ని ఉపాధి అవకాశాల కోసం వినియోగించొద్దని పేర్కొంది. నకిలీ జాబ్ ఆఫర్లతో మలేసియాకు వస్తోన్న భారతీయుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ మేరకు అడ్వైజరీ జారీ చేసింది. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు ఏజెంట్లు నిరుద్యోగులకు వల వేస్తున్నారని, వారి చేతిలో చాలా మంది మోసపోతున్నారని హైకమిషన్ తన అడ్వైజరీలో పేర్కొంది. పర్యాటక లేదా వీసా ఫ్రీ ట్రావెల్‌పై వచ్చి ఇక్కడ గడువుకు



మించి ఉండిపోతున్నారని, దీంతో చట్టపరంగా చర్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది. భారత పాస్‌పోర్ట్ కలిగిన వారికి ఇస్తున్న 30 రోజుల వీసా రహిత ప్రవేశం కేవలం పర్యాటకం, సామాజిక సందర్శన కోసం ఉద్దేశించినది మాత్రమేనని భారత హైకమిషన్ తెలిపింది. దీన్ని ఉపాధి అవసరాల కోసం వినియోగించడం మలేసియా వలస నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. కాబట్టి వర్క్ పర్మిట్ లేకుండా మలేసియాకు రావొద్దని సూచించింది. అలాగే, మలేసియా వచ్చే సాధారణ ప్రయాణికులు సైతం రిటర్న్ టికెట్, హోటల్ బుకింగ్ వంటి ట్రావెల్ ప్రణాళికతో రావడం వల్ల ఇమిగ్రేషన్ ఇబ్బందులు తలెత్తవని పేర్కొంది. పాస్‌పోర్టు వ్యాలిడిటీ కూడా కనీసం 6 నెలలు చెల్లుబాటులో ఉండేవిధంగా ఉండాలని సూచించింది. మలేసియా ఈ ఏడాది చివరి వరకు భారత పౌరులకు వీసా ఫ్రీ ట్రావెల్ సదుపాయాన్ని అందిస్తోంది.




## బిహార్ నుంచే అత్యధిక ఐఏఎస్‌లు..
## అయినా ఎందుకీ ఘోరాలు: ఖుష్బూ పటానీ

బిహార్‌లోని జముయి జిల్లాలో కోచింగ్‌కు వెళ్లి వస్తున్న ఇద్దరు టీనేజర్లపై కొందరు దుండగుల దాష్టీకం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటనపై హీరోయిన్ దిశా పటానీ సోదరి, మాజీ ఆర్మీ అధికారి ఖుష్బూ పటానీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిహార్ ప్రజలు ఇప్పటికైనా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళల భద్రతపై అధికారులను నిలదీయాలన్నారు. బిహార్ నుంచే అత్యధిక ఐఏఎస్‌లు వస్తున్నా..ఆ రాష్ట్రంలో ఇంకా ఎందుకీ ఘోరాలు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ‘భారత్ ఒక గొప్ప దేశంగా, విశ్వగురువుగా ఎదగాలని నేతలందరూ కోరుకుంటారు. మహిళలకు ఏమాత్రం గౌరవం లేనప్పుడు అదెలా సాధ్యమవుతుంది? మీరు బిహార్ కేసు చూసే ఉంటారు. కొందరు దుర్మార్గులు బాలిక పట్ల దారుణంగా వ్యవహరించారు. మత్తులో మునిగి తేలే చదువు లేని అజ్ఞానులు.. కొందరి చేతుల్లో పావులుగా మారి, ఇటువంటి పనులు చేస్తున్నారు. కోచింగ్ సెంటర్‌కు వెళ్లి వస్తున్న విద్యార్థులను అడ్డుకొని, హింసాత్మకంగా ప్రవర్తించిన తీరు చూస్తేనే.. వారు ఎంత క్రూరమైన వారో అర్థమవుతోంది. అత్యధిక ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బిహార్ నుంచే వస్తుంటే.. మన శాంతిభద్రతల వ్యవస్థ ఎందుకు కుప్పకూలింది? అమ్మాయిల జోలికి వచ్చిన వారికి కఠినమైన శిక్షలు విధించాలి’ అని ఖుష్బూ పటానీ డిమాండ్ చేశారు.

**ఏమి జరిగిందంటే..?**

శనివారం రాత్రి స్నేహితులైన ఇద్దరు టీనేజర్లు.. కోచింగ్ సెంటర్‌కు వెళ్లి వస్తుండగా రోడ్డుపైనే దుండగులు అడ్డగించారు. వారిపై దాడి చేశారు. బాలికను వెంటపడి కొట్టారు. గట్టిగా పట్టుకుని లాక్కెళ్లారు. అభ్యంతరకరంగా తాకారు. వారు దుండగుల నుంచి విడిపించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనికి



సంబంధించిన వీడియో సోమవారం వైరలైంది. వెంటనే స్పందించిన పోలీసులు సుమోటోగా పోక్సో కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో కీలక నిందితుడు నందన్ యాదవ్‌ను పట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా అతడు పారిపోవడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నిందితుడి కాలికి గాయాలైనట్లు తెలిపారు.




# క్రెడిట్ యుటిలైజేషన్ 30% రూల్.. ఒక్క కార్డుకా? అన్నింటికా?

క్రెడిట్ కార్డు వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది. బ్యాంకులు కూడా విరివిగా జారీ చేస్తుండడంతో ఒకటి కంటే ఎక్కువ కార్డులు వాడే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. సాధారణంగా ప్రతి కార్డుకూ ఓ పరిమితి ఉంటుంది. అలా వచ్చిన లిమిట్‌లో ఎంత శాతం వాడుకుంటున్నామో తెలిపే దాన్నే క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో అంటారు. ఈ నిష్పత్తి ఎప్పుడూ 30 శాతం మించకూడదని ఆర్థిక నిపుణులు చెప్పేమాట. మరి ఈ రూల్ ఒక్క క్రెడిట్ కార్డుకే వర్తిస్తుందా? లేదా అన్ని క్రెడిట్ కార్డులకా? రుణదాతలు క్రెడిట్ యుటిలైజేషన్ రేషియోను లెక్కించేటప్పుడు మీ వద్ద ఉన్న అన్ని క్రెడిట్ కార్డులను పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు మీ దగ్గర మూడు క్రెడిట్ కార్డులు ఉన్నాయనుకుందాం. అన్ని కార్డుల మొత్తం పరిమితి రూ.4 లక్షలు అనుకుంటే, అందులో మీరు ఉపయోగించింది కేవలం రూ.80 వేలే అయితే.. మీ క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో 20 శాతం మాత్రమే అవుతుంది. కాబట్టి ఒక దాంట్లో ఎక్కువ వాడి, మరో దాంట్లో తక్కువ వాడినా క్రెడిట్ యుటిలైజేషన్ రేషియోలో మార్పు ఉండదు. దీనివల్ల క్రెడిట్ స్కోరుకు వచ్చిన ఇబ్బందేమీ లేదు.



**అలాగని ఒకే కార్డుపై..**

అన్ని కార్డుల సగటు ఆధారంగా సీయూఆర్ లెక్కించినప్పటికీ.. రివార్డులు వస్తున్నాయనో, మరో కారణం చేతనో ఒకే కార్డును అధికంగా వినియోగించడమూ మంచిది కాదంటున్నారు నిపుణులు. మీ వద్ద 3 కార్డులు ఉండి.. మొత్తం వాడకం 20 శాతంలోపే ఉన్నప్పటికీ.. అందులో ఒక కార్డు లిమిట్‌ను 90 శాతం వరకు వాడడం సరికాదంటున్నారు. మీరు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారనో, అప్పుపై ఎక్కువ ఆధారపడుతున్నారనో క్రెడిట్ బ్యూరోలు భావించి మీ క్రెడిట్ స్కోరును తగ్గించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**ఇలా చేయడం మంచిది**

* మీ వద్ద ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులుంటే ఎక్కువ ఖర్చుల కోసం ఒకే కార్డుపై ఆధారపడకుండా పలు కార్డులను వాడడం ఉత్తమం.
* మీ మొత్తం క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో తక్కువగా ఉన్నప్పటికీ, ఏ ఒక్క కార్డునూ 80 శాతానికి మించి వాడొద్దు.
* ఒక కార్డును పెద్ద ఖర్చుల కోసం వాడాల్సి వస్తే, ఆ బిల్లు క్రెడిట్ బ్యూరోలకు రిపోర్ట్ అయ్యేలోపే (స్టేట్‌మెంట్ తేదీకి ముందే) అందులో కొంత మొత్తాన్ని చెల్లించడం మంచిది.

## చర్చలు విఫలం..
# సమ్మెకు వెళ్లనున్న బ్యాంకు సంఘాలు



దిల్లీ: వారానికి ఐదు రోజుల పని విధానంతో పాటు పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ బ్యాంకు యూనియన్లు మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నాయి. ఆర్థిక శాఖ సూచన మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో మంగళవారం జరిపిన చర్చలు విఫలం కావడంతో దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకటించింది. బ్యాంకు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, ఐదు రోజుల పని అంశం కూడా ప్రస్తుతం పరిశీలనలో ఉందని చర్చల సందర్భంగా ప్రభుత్వం పేర్కొంది. అయితే, వారానికి 5 రోజుల పని విధానాన్ని ప్రవేశపెట్టాలన్న తమ డిమాండ్ దిశగా సానుకూల పరిణామాలు కనిపిస్తే అప్పుడు సమ్మె వాయిదా గురించి పరిశీలిస్తామని యూఎఫ్‌బీయూ ప్రకటించింది. మరోవైపు సమ్మెకు ముందు శని, ఆదివారాలు బ్యాంకులు తెరుచుకోవు. 28 నుంచి 30 వరకు సమ్మె కారణంగా మూతపడనున్నాయి. దీంతో మొత్తం ఐదు రోజులు పాటు బ్యాంకు సేవలకు ఆటంకం కలగనుంది. ఈ నెల సెప్టెంబర్ 11న కూడా బ్యాంకు యూనియన్లు సమ్మె నిర్వహించిన సంగతి తెలిసిందే.

# ట్రాయ్ ఆదేశాలు.. ఇక మరిన్ని వాయిస్+SMS రీఛార్జి ప్లాన్స్



వాయిస్, ఎస్సెమ్మెస్ ప్రయోజనాలతో మరిన్ని స్పెషల్ టారిఫ్ వోచర్లను అందించాలని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ టెల్కోలను ఆదేశించింది. వాయిస్+ ఎస్సెమ్మెస్ ప్రయోజనాలు కలిగిన రీఛార్జి ఆప్షన్లు పరిమితంగా ఉన్నాయని, అధిక వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లే ఎక్కువగా ఉన్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో తక్కువ కాలవ్యవధితో అందుబాటు ధరలో ఈ స్పెషల్ టారిఫ్ వోచర్లను అందించాలని టెలికాం కంపెనీలను ఆదేశించింది. వాయిస్, ఎస్సెమ్మెస్ ప్లాన్లపై గతేడాది ఏప్రిల్ 7న సంప్రదింపుల పత్రాన్ని ట్రాయ్ విడుదల చేసింది. దీనిపై భాగస్వామ్యపక్షాల నుంచి అభిప్రాయాలను సేకరించింది. 1132 మంది తమ అభిప్రాయాలను తెలియజేశారు. జూన్ 15న ఓపెన్ హౌస్ డిస్కషన్ కూడా నిర్వహించింది. ఈ క్రమంలోనే టెలికాం కన్జూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్, 2026 నిబంధనలను తాజాగా జారీ చేసింది. దీని ప్రకారం.. వాయిస్, ఎస్సెమ్మెస్, డేటా ప్లాన్ల మాదిరిగానే వాయిస్, ఎస్సెమ్మెస్ ప్రయోజనాలతో కూడిన ప్లాన్లనూ అన్ని కాలవ్యవధులకు అందుబాటులో ఉంచాలని సూచించింది. 30 రోజులతో పాటు.. 30 రోజుల కంటే తక్కువ వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లు కూడా ఉండాలని సూచించింది. ఆపరేటర్లు ప్రతి నెలా ఒకే తేదీన రెన్యువల్ చేసుకోగలిగే వ్యాలిడిటీతో వాయిస్, ఎస్సెమ్మెస్‌లు ఉండే ఎస్‌టీవీలను అందించాల్సి ఉంటుంది. దీనివల్ల తక్కువ ఆదాయ వర్గాల వారు తమ అవసరాలకు అనుగుణంగా రీఛార్జు చేసుకునే వెసులుబాటు లభిస్తుందని ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ ఆదేశాల నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు స్వల్పంగా క్షీణించగా.. వొడాఫోన్ ఐడియా షేర్లు 2 శాతం మేర రాణించాయి.

## హోండా నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్..
# ధర, రేంజ్ వివరాలు ఇవే!



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా మార్కెట్లోకి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ హోండా QC3ని విడుదల చేసింది. దీని ధరను రూ.1.35 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్, దిల్లీ) నిర్ణయించింది. గతంలో యాక్టివా eలో స్వాపబుల్ బ్యాటరీ ఇవ్వగా.. ఇందులో మాత్రం 3kWh ఫిక్స్‌డ్ బ్యాటరీ వాడారు. ఈ స్కూటర్ సర్టిఫైడ్ రేంజ్ 145 కిలోమీటర్లుగా కంపెనీ పేర్కొంది. భారత్‌లో హోండా తీసుకొచ్చిన ఈవీల్లో అత్యధిక రేంజ్ కలిగిన స్కూటర్ ఇదే కావడం గమనార్హం. ఈ స్కూటర్‌ను 080 శాతం ఛార్జ్ చేయడానికి 2.40 గంటల సమయం పడుతుందని కంపెనీ చెబుతోంది. పూర్తి ఛార్జింగ్‌కు 4 గంటలు తీసుకుంటుంది. ఇందులో 5 అంగుళాల టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంది. హోండా రోడ్‌సింక్ కనెక్టివిటీ, టర్న్ బై టర్న్ నావిగేషన్, 32 లీటర్ల అండర్‌సీట్ స్టోరేజీ ఉన్నాయి.



# స్వర్ణ కాంతలు

* **టైటిల్ నిలబెట్టుకున్న హర్మన్‌ప్రీత్ బృందం**
* **2026 ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో తొలి పసిడి**

**ఆసియా క్రీడల్లో పసిడి కోసం నిరీక్షిస్తున్న అభిమానులను మురిపిస్తూ మూడో రోజు భారత శిబిరంలో స్వర్ణకాంతులొచ్చాయి. భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా ఖండంలో తన ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా రెండోసారి స్వర్ణ పతకం గెలుచుకుంది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ బృందం.. శ్రీలంకను చిత్తు చిత్తుగా ఓడించింది. పోటీల మూడోరోజు భారత్‌కు లభించిన పతకం ఇదొక్కటే. బ్యాడ్మింటన్‌లో పురుషుల జట్టు.. ఉషులో రోషిబినా దేవి సెమీఫైనల్ చేరడంతో భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయమయ్యాయి.**





**నిషిన్ (జపాన్)**

డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఆసియా క్రీడల మహిళల క్రికెట్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. మంగళవారం కనీస పోటీ ఎదురుకాని ఫైనల్లో, 147 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. స్మృతి మంధాన (79; 45 బంతుల్లో 5×4, 7×6), రిచా ఘోష్ (49 నాటౌట్; 22 బంతుల్లో 6×4, 3×6), షెఫాలి వర్మ (48; 29 బంతుల్లో 3×4, 3×6) చెలరేగడంతో మొదట భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు. ఛేదనలో శ్రీలంక తేలిపోయింది. స్పిన్నర్లు దీప్తి శర్మ (3/6), షెఫాలి వర్మ (2/3), శ్రీచరణి (2/13), శ్రేయాంక (2/9) ధాటికి 15.4 ఓవర్లలో 69 పరుగులకే కుప్పకూలింది. చమరి ఆటపట్టు (29) టాప్ స్కోరర్. ఆమె కాకుండా కౌషిని (14), కవిష (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. లంక ఏ దశలోనూ పోటీలో లేదు. ఆ జట్టు 26 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు చేజార్చుకుంది.

**దంచేశారు..:** ఫైనల్లో తిరుగులేని ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్.. అంచనాలకు తగ్గట్లే చెలరేగిపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆ జట్టుకు ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలి వర్మ అదిరే ఆరంభాన్నిచ్చారు. సుగంధిక వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు దంచేసిన స్మృతి.. ఆమె తర్వాతి ఓవర్లో వరుసగా 6, 6 బాదేసింది. మిథాలి ఓవర్లో షెఫాలి రెండు ఫోర్లు, సిక్స్‌తో విరుచుకుపడింది. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 67/0తో నిలిచింది. ఆ తర్వాత కూడా ఓపెనర్లు జోరు కొనసాగించారు. స్మృతి 30 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసింది. పదో ఓవర్లో షెఫాలి నిష్క్రమణతో 99 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం విడిపోయింది. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (19; 17 బంతుల్లో 3×4) ధాటిగా ఆడలేకపోయినా.. స్మృతి మాత్రం తగ్గలేదు. ఆ తర్వాత వికెట్‌కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ విరుచుకుపడింది. ఫోర్లు, సిక్స్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఆమె విధ్వంసంతో ఆఖరి 5 ఓవర్లలో భారత్ 74 పరుగులు రాబట్టింది. సెంచరీ చేసేలా కనిపించిన స్మృతి 17వ ఓవర్లో నిష్క్రమించగా.. ఫుల్మాలి (7 నాటౌట్)తో అభేద్యమైన నాలుగో వికెట్‌కు రిచా 19 బంతుల్లో 53 పరుగులు జోడించింది. మరోవైపు కాంస్యం కోసం జరిగిన పోరులో పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది.




## అమ్మాయిలూ.. దేశం గర్విస్తోంది
# టీమ్‌ఇండియాపై మోదీ ప్రశంసలు



వరుసగా రెండోసారి ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత మహిళా జట్టు స్వర్ణం నెగ్గింది. తాజాగా శ్రీలంకపై 147 పరుగుల భారీ వ్యత్యాసంతో టీమ్‌ఇండియా విజయం సాధించింది. దీంతో ఆసియా క్రీడలు 2026 ఎడిషన్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించింది. హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించింది. స్వర్ణ పతకం నెగ్గిన అమ్మాయిల జట్టుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ సహా పలువురు అభినందనలు తెలిపారు. ''భారత మహిళ జట్టు సభ్యులందరికీ నా శుభాకాంక్షలు. చరిత్రలో నిలిచిపోయే విజయంతో ఈ ఎడిషన్‌లో తొలి బంగారు పతకం అందించారు. జాతి గర్వపడేలా చేశారు. అద్భుతమైన ప్రదర్శన, బృంద స్ఫూర్తి, నిబద్ధత.. రాబోయే తరాలకు మరీ ముఖ్యంగా ఆడబిడ్డలకు స్ఫూర్తిదాయకం'' — ద్రౌపది ముర్ము

# భయపెట్టిన జపాన్

**కష్టంగా గెలిచిన భారత్**

సానో (జపాన్) : ఆసియా క్రీడలకు ముందు జపాన్‌తో ఏకైక టీ20 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా చెమటోడ్చింది. మంగళవారం రసవత్తరంగా సాగిన స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో 2 పరుగుల తేడాతో నెగ్గింది. వర్షం వల్ల చాలా ఆట వృథా కాగా.. ఇన్నింగ్స్‌ను 5 ఓవర్లకు కుదించారు. బంతి ఎక్కువగా తిరగడంతో రెండు జట్ల మధ్య ఉన్న భారీ అంతరం తగ్గిపోయింది. బ్యాటింగ్‌కు చాలా కష్టంగా ఉన్న పిచ్‌పై భారత్ మొదట 4 వికెట్ల నష్టానికి 32 పరుగులే చేయగలిగింది. శ్రేయస్ (16; 12 బంతుల్లో 1×4) టాప్ స్కోరర్. జపాన్ స్పిన్నర్లు చార్లీ హారా హింజె (2/17), తకహషి ఇబ్రహీం (1/13), బెంజమిన్ డేవిస్ (1/2) భారత్‌కు కళ్లెం వేశారు. అనంతరం భారత్ కూడా స్పిన్‌తో జపాన్‌ను కట్టిపడేసింది. సుందర్ (2 ఓవర్లలో 2/13), అక్షర్ (2 ఓవర్లలో 0/7) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో స్వల్ప ఛేదనలో జపాన్.. 3 వికెట్లకు 30 పరుగులే చేయగలిగింది. ఫ్లెమింగ్ (12) టాప్ స్కోరర్. శ్రేయస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

భారత్ తడబాటు..: భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. మందకొడి పిచ్‌పై బంతి బాగా తిరగడంతో స్ట్రోక్‌ప్లే సాధ్యం కాలేదు. అభిషేక్ (0) తొలి ఓవర్లోనే ఔటయ్యాడు. హారా హింజె బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్ ఆడబోయిన అతడు.. ఎడ్జ్‌తో క్యాచ్ ఔటయ్యాడు. తర్వాతి ఓవర్లో ఓ ఫ్లైటెడ్ డెలివరీతో శాంసన్ (9)ను తకహషి బోల్తా కొట్టించాడు. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన ఇషాన్ కిషన్ (3)ను మూడో ఓవర్లో డేవిస్ పెవిలియన్ చేర్చాడు.



అప్పటికి భారత్ స్కోరు 14. శ్రేయస్ కూడా ఓ బౌండరీ కొట్టినప్పటికీ ధాటిగా ఆడలేకపోయాడు. భారత జట్టు ఇన్నింగ్స్‌లో రెండే ఫోర్లు ఉండడం గమనార్హం. శ్రేయస్ ఆఖరి ఓవర్లో ఔటయ్యాడు. పిచ్ పరిస్థితి చూస్తే స్వల్ప ఛేదన కూడా కష్టమేనని అర్థమైంది. జపాన్ అందుకు తగ్గట్లే ఆడింది. మూడో ఓవర్లో బిష్ణోయ్ 10 పరుగులు ఇచ్చినా.. సుందర్, అక్షర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో జపాన్ 4 ఓవర్లలో 25/3తో నిలిచింది.. ఆఖరి ఓవర్లో ఆ జట్టుకు 8 పరుగులు అవసరం కాగా.. అక్షర్ 5 పరుగులే ఇవ్వడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది. ఆ వైడ్ వెనక్కి..: జపాన్ ఛేదనలో అంపైర్ నిర్ణయం వివాదాస్పదమైంది. చివరిదైన అయిదో ఓవర్లో జరిగింది ఆ ఘటన. జపాన్ 4 బంతుల్లో ఏడు పరుగులు చేయాల్సివుంది. అక్షర్ బౌలింగ్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్.. షిరాయ్ పాత్మోర్ రివర్స్ హిట్ ఆడడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. బ్యాటర్ తన రెగ్యులర్ స్టాన్స్‌లో ఉండి ఉంటే.. బంతి అతడికి లెగ్‌సైడ్ అయ్యేది. అంపైర్ క్రిస్ తుర్గేట్ (జపాన్) దాన్ని వైడ్‌బాల్‌గా ప్రకటించాడు. దీంతో భారత ఆటగాళ్లు అసంతృప్తికి గురయ్యారు. గత పదేళ్లుగా అలాంటి బంతులను వైడ్లుగా ప్రకటించట్లేదు. సరిగ్గా అలాంటి పరిస్థితుల్లోనే తర్వాతి బంతిని కూడా అంపైర్ వైడ్ ఇచ్చాడు. దీంతో భారత క్రికెటర్లలో అసహనం పెరిగిపోయింది.

# ఏందయ్యా సామీ ఇట్ట గాస్తాంది వెన్నెల



పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మూవీ రణబాలి. హిస్టారికల్ యాక్షన్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీకి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 16న థియేటర్లలోకి రాబోతుంది. రణబాలి ఫస్ట్ సింగిల్ మంగళవారం రిలీజైంది. నాయకానాయికల పెళ్లి సందర్భంగా వచ్చే రొమాంటిక్ సాంగ్ ఇది. ఈ పాటలో విజయ్, రష్మిక కెమిస్ట్రీని చాలా అందంగా చూపించారు దర్శకుడు. 19వ శతాబ్దం నాటి వాతావరణం, భార్యాభర్తల అనురాగాన్ని, సరసాన్ని చాలా సహజంగా ఆవిష్కరించారు. లిరిక్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా...అజయ్ – అతుల్ మ్యూజిక్ అందించారు. అజయ్ గొగవలే, శ్వేతా మోహన్ ఆలపించారు. ఈ పాటను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేశారు.



సినిమా

# సుబ్బలక్ష్మిగా సర్‌ప్రైజ్ చేస్తా

"ప్యారడైజ్‌లో సుబ్బలక్ష్మి అనే పాత్ర చేశా. కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన పాత్రలతో పోలిస్తే ఈ రోల్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది" అని కయదు లోహర్ పేర్కొన్నది. ఆమె హీరోయిన్‌గా నటించిన ప్యారడైజ్ మూవీ సెప్టెంబర్ 24న థియేటర్లలోకి రాబోతుంది. నాని హీరోగా నటించిన ఈ మూవీకి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. ప్యారడైజ్ రిలీజ్ సందర్భంగా కయదు లోహర్ పాత్రికేయులతో మాట్లాడుతూ నా క్యారెక్టర్‌లో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. అవన్నీ మీరు బిగ్ స్క్రీన్ మీద చూడాలి. జడల్ లవ్ పార్ట్‌నర్‌గా కనిపిస్తాను. అలాగే నాకంటూ సినిమాలో ఒక జర్నీ ఉంటుంది. పెర్ఫార్మెన్స్ స్కోప్ ఉన్న పాత్ర. కథలో చాలా కీలకంగా ఉంటుంది. సుబ్బు క్యారెక్టర్ గురించి అప్పుడే ఎక్కువ రివీల్ చేయకూడదు. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలన్నిటితో పోలిస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది అని వ్యాఖ్యానించింది.





# 48 ఏళ్ల క్రితం ఇదే రోజు..

టాలీవుడ్ అగ్ర హీరో మెగాస్టార్ చిరంజీవి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటితో 48 ఏళ్లు పూర్తయ్యాయి. 1978లో రిలీజైన ప్రాణం ఖరీదు సినిమాతో నటుడిగా తొలిసారి కెమెరా ముందుకొచ్చారు. చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో నటనలో శిక్షణ పూర్తిచేసుకొని అవకాశాల కోసం ఎదురుచూస్తున్న శివశంకర వరప్రసాద్.. ఈ సినిమాతోనే చిరంజీవిగా మారారు. కే వాసు దర్శకత్వంలో రూపొందిన ఈసినిమాలో నర్సయ్య అనే ఆవేశపరుడైన యువకుడి పాత్రలో చిరంజీవి అసమాన నటనతో తెలుగు ప్రేక్షకులను మెప్పించాడు. ప్రాణం ఖరీదు విడుదలై నలభై ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ చిరంజీవి ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "ఈ సుదీర్ఘ ప్రయాణంలో నన్ను నమ్మి అవకాశాలు ఇచ్చిన ప్రతి నిర్మాతకు, నాలోని నటుడిని కొత్త కొత్త కోణాల్లో ఆవిష్కరించిన ప్రతి దర్శకుడికి, నా ప్రతి సినిమా వెనుక అహర్నిశలు శ్రమించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆరోజు "చిరంజీవి" అనేది నేను పెట్టుకున్న పేరు. నేడు మీ ప్రేమతో అది నాకు దక్కిన శాశ్వతమైన గుర్తింపు "అని ఈ పోస్ట్‌లో చిరంజీవి పేర్కొన్నారు.

# వివాదంలో తమన్నా మూవీ

తమన్నా బాలీవుడ్ మూవీ ది వాన్ వివాదంలో చిక్కుకుంది. తాను కంపోజ్ చేసిన పాటను అనుమతి లేకుండా సినిమాలో వాడుకున్నారంటూ ఓ మ్యూజిక్ డైరెక్టర్ ఆరోపించారు. వాన్ మూవీ టీమ్‌పై చట్టప్రకారం పోరాటానికి సిద్ధమవుతోన్నట్లు ప్రకటించారు. సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా హీరోహీరోయిన్లుగా నటించిన ది వాన్ సెప్టెంబర్ 25న రిలీజ్ కాబోతుంది. రహస్యాలతో నిండిన ఓ అటవీ ప్రాంతం, ఆ ప్రాంత వాసులను కాపాడుతోన్న ఓ దేవత కథతో ఈ మూవీ తెరకెక్కుతోంది. వాన్ మూవీ ట్రైలర్‌ను ఇటీవల రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ఉపయోగించిన అయిగిరి నందిని అనే సాంగ్‌తో పాటు ట్యూన్ తాను కంపోజ్ చేసినవేనని ఇండిపెండెంట్ మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ సర్గమ్ ఆరోపించారు. తన అనుమతి లేకుండా ఆ పాటను ట్రైలర్‌లో ఉపయోగించారని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టాడు.

# కర్ణుడిగా లారెన్స్



రమేష్ వర్మ తమిళంలో ఓ మైథాలజీ మూవీ చేయబోతున్నాడు. ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. మహాభారతంలోని కర్ణుడి పాత్ర ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాకు మహావీర్ కర్ణ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాలో కర్ణుడిగా టైటిల్ పాత్రలో రాఘవ లారెన్స్ నటిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో నుదుటిపై సూర్యతిలకంతో రౌద్రంగా లారెన్స్ కనిపిస్తున్నారు. హైబ్రీడ్ లైవ్ యాక్షన్ ఫార్మెట్‌లో దాదాపు 150 కోట్లతో మహావీర్ కర్ణ మూవీ రూపొందుతోంది. భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, పీరియాడికల్ సెట్స్‌తో పాటు గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ హంగులతో ఈ సినిమాను తెరకెక్కించేందుకు ప్లాన్ చేసున్నారు.